5వ పాఠం జూలై 25-31

# ఆత్మ యొక్క అధికారముతో సాక్ష్యమిచ్చుట

## సబ్బాతు మధ్యాహ్నము జూలై 25

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యోహాను 15:26,27; అపొ॥కార్య 2:41, 42; 8:4; హెబ్రి 4:12; అపొ॥కార్య 17:33,34; 18:8.**

**కంఠతవచనం:** **"వారు ప్రార్థన చేయగానే వారు కూడియున్న చోటు కంపించెను. అప్పుడు వారందరు పరిశుద్ధాత్మతో నిండిన వారై దేవుని వాక్యమును ధైర్యముగా బోధించిరి" (అపొ॥కార్య 4:31).**

"యేసు తొలి విశ్వాసులకు మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి" (మార్కు 16:15) అని ఆజ్ఞను జారీ చేసినపుడు అది ఒక అసాధ్యమైన సువార్త పరిచర్యగా కనిపించియుండవచ్చును. అంత పెద్ద సవాలును వారు ఎట్లు పూర్తి చేయగలరు లేక సాధించగలరు? ఆ విశ్వాసుల సంఖ్య బహు స్వల్పమైనది. వారికున్న వనరులు పరిమితులతో కూడుకొనినవై యున్నవి. వారిలో ఎక్కువ మంది విద్యను అభ్యసించని సామాన్య విశ్వాసుల బృందమైయున్నది. వారి కప్పగింపబడిన సువార్త పరిచర్య భాగము అసాధారణమైనదైనప్పటికి వారికి అధికారమునిచ్చి వారిని శక్తివంతులుగా చేయగలిగే ఒక అసాధారణమైన దేవుడు వారికున్నాడు.

అయితే యేసు ఈ విధముగా ప్రకటించాడు. "అయినను పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునపుడు మీరు శక్తినొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను" (అపొ॥కార్య 1:8). పరిశుద్ధాత్మ వారిని శక్తిమంతులనుగా చేయుట వలన జీవితాలను మరియు ఈ ప్రపంచమును మార్పు చేయగల శక్తి కలిగిన సిలువ వర్తమానమును ప్రకటించుటకు వారు సామర్థ్యమును పొందియున్నారు. వారిచ్చిన సాక్ష్యము ఫలభరితమగునట్లు పరిశుద్ధాత్మ వారికి సహాయపడెను. కొన్ని దశాబ్దములలోనే సువార్త వర్తమానము లోకమంతటిని ప్రభావితము చేయగలిగింది. ఆ తొలి విశ్వాసులు "భూలోకమును తలక్రిందులు చేసియున్నారు" (అపొ॥కార్య 7:6). అని అపొ॥కార్య గ్రంథము ప్రకటించుచున్నది. ఇదే విషయమును గూర్చి పౌలు వ్రాస్తూ సువార్త వర్తమానము "ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడెను. (కొలస్స 1:23) అని చెప్పెను. ఈ వారము పాఠములో క్రీస్తు కొరకు మనము ఇచ్చే సాక్ష్యము విషయములో పరిశుద్ధాత్మ ఏవిధముగా మనలను ప్రభావితము చేయగలడో అనే అంశము మీద మనము అధ్యయనము చేయబోవుచున్నాము.

– ఆగష్టు 1, సబ్బాతు దినమున ఈ పాఠమును అధ్యయనము చేయుటకు ఈ వారమంతయు సిద్ధపడుడి.

ఆదివారం జూలై 26

## యేసు మరియు పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానము

యేసు శిష్యులను విడిచి తిరిగి పరలోకమునకు వెళ్ళిపోవుచున్నాడనే విషయమును గూర్చి వారు ఆందోళన చెందుచుండగా పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానముతో యేసు వారిని కలిసెను. "అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనకరము ఆయనను మీయొద్దకు పంపుదును" (యోహాను 16:7). ఆదరణ కర్త అనే పదమునకు సమానమైన గ్రీకు పదము "పారాక్లిటోస్" అనగా ప్రక్కనే ఉండి సహాయము చేయుటకై రానైయున్నవాడని అర్థమును ఇస్తున్నది. విశ్వాసులందరి ప్రక్కన ఉండి వారు సాక్ష్యమిచ్చే కార్యకలాపములలో వారిని శక్తిమంతులనుగా చేసి వారిని నడిపించుటయే పరిశుద్ధాత్ముని యొక్క విధులలో ఒక ప్రధానమైన విధియైయున్నది. మనము యేసు కొరకు సాక్ష్యమిచ్చేటప్పుడు మనము ఒంటరి వారము కాదు. నమ్మకమైన హృదయముతో యేసును వెతుకుచున్న వారి యొద్దకు మనలను నడిపించుటకు పరిశుద్ధాత్మ మన ప్రక్కనే ఉంటాడు. అటువంటి వారిని మనము కలుసుకొనకపూర్వమే ఆయన వారి హృదయములను సిద్ధము చేస్తాడు. ఆయన మన తంపులకు కావలిగా ఉంటాడు. యేసును వెదకు వారి మనస్సులలో ధృడ విశ్వాసమును కలుగజేస్తాడు. మరియు ఆయన అనుగ్రహించే సలహాలకు స్పందించే విధముగా వారిని బలపరుస్తాడు.

**యోహాను 15:26,27; 16:8 చదువుడి. సాక్ష్యమిచ్చే పరిచర్యలో పరిశుద్ధాత్ముని యొక్క పాత్రను గూర్చి ఈ వాక్యాలు మనకు ఏమి చెప్పుచున్నవి?**

-------------------------------------------------

-------------------------------------------------

పరిశుద్ధాత్మ యేసును గూర్చి సాక్ష్యమిస్తాడు. యేసు యొద్దకు ఎంతమందిని నడిపించుటకు వీలవుతుందో అంతమందిని నడిపించడమే ఆయన అంతిమ గురియైయున్నది. యేసును మహిమ పర్చడమే ఆయన పరిచర్య యొక్క భావమైయున్నది. ఈ పాత్రలో ఆయన విశ్వాసులందరిని వారి యొక్క బాధ్యత ప్రకారము సాక్ష్యమివ్వమని ఒప్పిస్తాడు. మన చుట్టూ ఉన్న ప్రజలలో సువార్త వర్తమానమును స్వీకరించే మనస్సును వారిలో సిద్దపర్చుటకు తెరవెనుక ఉండి పనిచేస్తాడు.

యోహాను సువార్త చాలా స్పష్టముగా వివరిస్తుంది. "ఆయన వచ్చి పాపమును గూర్చి లోకమును ఒప్పుకొనజేయును" (యోహాను 16:8) అనగా దేవుని నుండి దూరమైపోయిన వారి హృదయములలో మార్పును తీసుకొని వచ్చి వారు మారుమనస్సు పొందడము అవసరమని తెలియచేస్తాడు. ఆయన లోకమును "నీతిని గూర్చియు" ఒప్పుకొనజేయును. పరిశుద్ధాత్మ మనలోని పాపమును బయలుపర్చుటే కాక, నీతి విషయమై మనకు బోధ చేయును. మన అవినీతి ముందు యేసుని నీతి యొక్క దివ్యత్వమును బయలుపర్చును. మనము ఎంత చెడ్డవారముగా ఉన్నామో కేవలం చూపించడము మాత్రమే కాకుండా యేసు యొక్క స్వరూపము మనలో ఏర్పడునట్లు సహాయము చేయును. యేసు ఎంత ప్రేమామయుడో ఎంత కరుణామయుడో, ఎంత దయామయుడో, ఎంత మంచివాడో మనకు బయలుపర్చడము పరిశుద్ధాత్మ యొక్క విధులలో ఒకటైయున్నది.

సాక్ష్యమిచ్చుట అనగా యేసును మహిమపర్చుటలో పరిశుద్ధాత్మతో సహకరించడమని అర్థము. మన జీవితాలను మార్చివేసిన ఆశ్చర్యకరుడైన క్రీస్తును గూర్చి ఆత్మ యొక్క శక్తితో ఆయన నడుపుదల క్రింద సాక్ష్యమివ్వగలము.

**ఆత్మల కొరకు పనిచేయాలనే కోరిక కలిగిన మనము, మన కృషితో ఇతరులలో మారుమనస్సును తీసుకొనిరాలేమనియు అది కేవలం పరిశుద్ధాత్మ యొక్క పనియైయున్నదని ఎల్లప్పుడు మనము ఎందుకు జ్ఞాపకముంచుకోవాలి?**

**సోమవారం** **జూలై 27**

## అధికారము ఇవ్వబడిన క్రైస్తవ సంఘము

అపొస్తలుల కార్యములు పుస్తకమును “పరిశుద్ధ దేవుని కార్యములు” గ్రంథమని పిలుచుట జరిగింది. సాక్ష్యమిచ్చుటలోను, సువార్తను ప్రకటించుటలోను క్రైస్తవ సంఘము యొక్క ఎదుగుదల వంటి విషయాలకు సంబంధించి పరిశుద్ధాత్మ ద్వారా జరిగిన ఉత్తేజకరమైన సాహస కృత్యములను గూర్చి ఈ గ్రంథము వివరించుచున్నది. దేవునికి సమర్పించుకొనిన విశ్వాసులు పరిశుద్ధాత్మతో నింపబడిన వారై క్రీస్తు కొరకు లోకమును ప్రభావితము చేసారు. ఆశ్చర్యకరమైన ఫలితములను సాధించుటలో వారు పూర్తిగా పరిశుద్ధాత్మ మీద ఆధారపడ్డారు. స్త్రీ పురుషులలో ఎవరైతే ఆయనకు సంపూర్ణముగా సమర్పించుకుంటారో అటువంటి వారి ద్వారా పరిశుద్ధాత్మ ఎటువంటి కార్యములను నెరవేర్చగలదో చూపించుటకు వారి చర్యలే మాదిరిగా ఉన్నాయి.

**అపొ॥కార్య 2:41, 42; 4:4, 31; 5:14, 42; 6:7 మరియు అ॥కార్య 16:5 చదువుడి. ఈ వాక్యములలోని ఏవిషయమును గూర్చి మీరు ఎక్కువ ప్రభావితమయ్యారు? త్వరితగతిని క్రైస్తవ సంఘము ఎదుగుచున్న విషయాలను గూర్చి ఈ పుస్తకము యొక్క గ్రంథకర్తయైన లూకా మనతో ఎంతో ఆనందముగా పంచుకొనుచుండగా మనకు దాని వెనుక వున్న ఆయన వర్తమానము ఏమిటి?**

---------------------------------------------

---------------------------------------------

ఆదిమ క్రైస్తవ సంఘములో పరిశుద్ధాత్ముని సువార్త పరిచర్యను గూర్చి మనతో పంచుకోవాలని అ॥కార్య పుస్తకము యొక్క గ్రంథకర్తయైన లూకా ఉద్దేశించియున్నాడు.

మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్ముని యొక్క కదలికల వలన క్రైస్తవ సంఘములో సంభవించిన ఎదుగుదలలో దాగియున్న సంఖ్యను లెక్కించి వ్రాయుటలో గ్రంథకర్త ఏమాత్రము సంకోచించలేదు. బాప్తిస్మముల సంఖ్యను ఆయన లెక్కిస్తున్నారు. అపొ॥కార్య 2:41లో ఒకే స్థలములో ఒకే రోజున సంభవించిన బాప్తిస్మముల సంఖ్య 3000 అని ప్రముఖముగా చూపించాడు. అపొ॥కార్య 4:4లో 5 వేల మంది బాప్తిస్మము పొందినట్లు ఆయన మాట్లాడుచున్నాడు. అపొ॥కార్య 5:14లో అనేకులు అనగా పెద్ద సంఖ్యలో స్త్రీ పురుషులు వచ్చి ప్రభువును అంగీకరించి బాప్తిస్మము పొందియున్నట్లు ఆయన వ్రాస్తున్నాడు.

ఒక్కొక్కసారి, ఒక వ్యక్తియైనను కావచ్చు. ఉదా: లిడియా, ఫిలిప్పీయుడైన అధికారి, దురాత్మలచేత పీడింపబడిన ఒక బానిస బాలిక లేక ఇతియోపీయుడైన నపుంసకుడు వారు

ఎవరైనను కావచ్చు. లూకా వారిని గుర్తించి ఆ ప్రజల హృదయాలలో పరిశుద్ధాత్ముని యొక్క కదలికలను వ్రాసియుంచాడు. ఇక్కడ ఒక ప్రాముఖ్యమైన విషయమేమిటంటే పెద్ద సంఖ్యలో ఉన్న విశ్వాసుల గుంపు వెనుక వ్యక్తిగతముగా పనిచేసిన మానవ మాత్రులు ఉన్నారు. ఎవరి కొరకైతే యేసు క్రీస్తు మరణించాడని నమ్మారో అటువంటివారు దేవుని బిడ్డగా ఒక్కొక్కరుగా వచ్చి చేరి ఆ పెద్ద సంఖ్యకు కారణమయ్యారు. అవును క్రీస్తును అంగీకరించిన వారి సంఖ్య ఎంత పెద్దదైనను కావచ్చు కాని చివరికి ఒకరికొకరు సాక్ష్యమిచ్చే ప్రయత్నము వలననే వారి హృదయములలో మార్పు సంభవించినది.

నూతన నిబంధన క్రైస్తవ సంఘము త్వరితముగా ఎదుగుచుండగా వాటికి అన్ని సదుపాయములు కల్పించుటకు నూతన సంఘములు ఆయా ప్రాంతములలో స్థాపించడము జరిగియున్నది. ఒక సంఘము తన వంతు సేవగా నూతన సంఘములను స్థాపించుట వలన ఆదిమ సంఘము చాలా త్వరితముగా వృద్ధి చెందుటకు ఒక కారణముగా నిలిచింది. నేడు ఇది మనకు ఎంత ప్రాముఖ్యమైన వర్తమానమైయున్నదో గ్రహించవలసియున్నాము.

**పరిచర్య చేయుట ద్వారా విస్తరించుట అనునది నూతన నిబంధన ఆదిమ క్రైస్తవ సంఘము యొక్క ప్రధాన లక్ష్యమై యున్నది. మన ప్రాంతీయ సంఘాలలో ఇదే ఒక ప్రధాన లక్ష్యముగా ఎట్లు పనిచేయగలవు?**

మంగళవారం జూలై 28

## పరిశుద్ధాత్మ మరియు సాక్ష్యమిచ్చుట

అపొ॥కార్య పుస్తకమంతటిలో పరిశుద్ధాత్మ చాలా శక్తివంతముగా కనిపించాడు. విశ్వాసులు అనేకరీతులలో వారి ప్రభువుని గూర్చి సాక్ష్యమిచ్చుచుండగ పరిశుద్ధాత్మ వారికి సహాయపడుతూ, ఆ పరిచర్యలో పాల్గొనే వాడు. వ్యతిరేక సాంప్రదాయాల మధ్యన విశ్వాసులు సువార్త పరిచర్య చేయుచు ప్రభువుని గూర్చి సాక్ష్యమిచ్చేటప్పుడు శోధనలు మరియు సవాళ్ళు ఎదురైనపుడు పరిశుద్ధాత్మ వారిని బలపర్చి ముందుకు తీసుకొని వెళ్లేవాడు. సత్యమును హృదయ పూర్వకముగా వెతికే వారి యొద్దకు విశ్వాసులను నడిపించేవాడు. పట్టణాలలో సువార్త పరిచర్య చేయుటకు విశ్వాసులు ఆ పట్టణాలలో అడుగు పెట్టక పూర్వమే అక్కడున్న ప్రజల హృదయాలను ముందుగానే సిద్ధపర్చి యుంచేవాడు. ఊహించని రీతులలో అవకాశములనే ద్వారములను ఆయన ముందుగానే తెరచియుంచి, అదే సమయములో విశ్వాసులను శక్తిమంతులుగా చేయుట ద్వారా వారి మాటలలోను, క్రియలలోను ప్రభువును గూర్చి సాక్ష్యమివ్వగలిగేవారు.

**అపొ॥కార్య 7:55; 8:29; 11:15; అపొ॥కా 15:28,29; 16:6-10 చదువుడి. ఈ బైబిలు వాక్యాలలో పొందుపర్చబడినట్లు సాక్ష్యమిచ్చుచున్న శిష్యులకు పరిశుద్ధాత్మ ఏవిధముగా పరిచర్య చేసేవాడు? అక్కడున్న పరిస్థితులను బట్టి పరిశుద్ధాత్మ అందించిన వివిధ విషయాలు ఏమిటి?**

---------------------------------------------

---------------------------------------------

మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్మ చేసిన వివిధ రకాలైన పరిచర్యలు నిజముగానే

ఆశ్చర్యమును కలిగించాయి. ఆయన క్రియలు ఏవిధముగా ఉంటాయో పైన ఉదాహరించిన అనుభవములు ఒక మాదిరిగా చూపించబడినవి. అదుపు తప్పిన జనులు స్తెఫనును రాళ్ళతో కొట్టి చంపిన సమయములో తన ప్రభువు కొరకు సాక్ష్యమిచ్చుటకు స్తెఫనును పరిశుద్ధాత్మ బలపర్చెను. ఆఫ్రికా ఖండములో సువార్త వర్తమానము వినిపించబడుటకు మంచి పలుకుబడి కలిగిన సత్యాన్వేషణలో ఉన్న ఒక ఇతియోపియా దేశస్తుని యొద్దకు ఆశ్చర్యకరముగా పరిశుద్ధాత్మ ఫిలిప్పును నడిపించెను. అన్యజనుల నుండి విశ్వాసులైన వారి మీదికి కూడా పరిశుద్ధాత్మ వరము వచ్చినపుడు అవును అది నిజమే అని ధృడ పరిచే గుర్తును పేతురునకు ఆయన యిచ్చెను. సున్నతి విషయమై సంఘము రెండుగా చీలిపోయే ప్రమాదము ఏర్పడినప్పుడు ఐకమత్యముతో సంఘమును ఒకటిగా చేసెను. మరియు పరిశుద్ధాత్మ అపొస్తలుడైన పౌలు ద్వారా సువార్త వర్తమానమును ప్రకటించుటకు ఐరోపా ఖండమునంతటిని తెరచి యుంచెను.

నూతన నిబంధన క్రైస్తవ సంఘములో పరిశుద్ధాత్మ క్రియాశీల సేవ చేసినట్లుగానే నేటి సంఘమునకు కూడా సేవ చేయుటకు సిద్ధముగానే ఉన్నాడు. ఆయన మనలను బలపర్చి శక్తిమంతులునుగా చేసి బోధించి, నడిపించి, ఐక్యపరచి ఈ లోకములోనికి అతి ప్రాముఖ్యమైన సువార్త పరిచర్యతో మనలను పంపించాలని ఆయన ఆశించుచున్నాడు. స్త్రీ పురుషులను యేసుకు మరియు ఆయన సత్యమునకు సాక్షులుగా పంపించుటకు సిద్దముగా ఉన్నాడు. అపొస్తలుల కాలములోను, ఆదిమ సంఘము యొక్క కాలములోను క్రియాశీల సేవ చేసిన పరిశుద్ధాత్మ నేడు కూడా ఆవిధముగానే పనిచేయుచున్నట్లు మనము జ్ఞాపకము చేసుకొనవలసియున్నాము.

**మన జీవితాలలో పరిశుద్ధాత్మ యొక్క శక్తిని పొందుటకు, అనుకూలముగా ఉండుటకు దినదినము మనము ఏమి చేయవలసియున్నాము. మనతోను మరియు మన ద్వారా ఆయన పనిచేయుటకు ఎటువంటి నిర్ణయాలు తీసుకొనవలసియున్నాము?**

**బుధవారం** **జూలై 29**

## పరిశుద్ధాత్మ, దేవుని వాక్యము మరియు సాక్ష్యమిచ్చుట

నూతన నిబందన సంఘము సాక్ష్యమిచ్చుటకు దేవుని వాక్యము ధైర్యమును అనుగ్రహించేది. అదే మూలాధారమైయుండెడిది. పెంతెకోస్తు దినమున పేతురు చేసిన ప్రసంగములలో ఎక్కువ భాగము పాతనిబంధన గ్రంథములోని కార్యములను ఆధారము చేసుకొని క్రీస్తే మెస్సియాయని విశ్వాసులకు నిరూపించాడు. స్తెఫను మరణిస్తూ ఇచ్చిన సాక్ష్యము పాతనిబంధనలోని ఇశ్రాయేలీయుల చరిత్రను పునరాలోచన చేసేవిధముగా వారికి కనిపించినది. దేవుడు ఇశ్రాయేలు జనాంగమునకు పంపిన వర్తమానమును పేతురు వారి దృష్టికి తీసుకొనివచ్చెను (అపొ॥కా 10:36). మరియు పునరుత్థానమునకు సంబంధించిన వృత్తాంతమును కొర్నేలితో పంచుకొనెను. పేతురు అనేకసార్లు ఎత్తి చూపిస్తూ యెషయా 53లో మెస్సీయాను గూర్చి వ్రాయబడిన విశేష విషయములను సత్యమును వెదకుచున్న ఇతియోపీయునికి ఫిలిప్పు బహుజాగ్రత్తగా వివరించెను. ప్రతి సమావేశములోను శిష్యులు వారి స్వంత మాటలు కాకుండా దేవుని వాక్యాలను మాత్రమే ప్రకటించేవారు. వారు గొప్ప

అధికారముతో మాట్లడుతూ ఆత్మావేశము వలన కలిగిన వాక్యమే వారికి మూలాధారముగా ఉండేది.

**అపొ॥కార్య 4:4, 31; 8:4; 13:48,19; అపొ॥కా 17:2; 18:24,25 చదువుడి. పరిశుద్ధాత్మకు దేవుని వాక్యమునకు నూతన నిబంధన సంఘము ఇచ్చిన సాక్ష్యమునకు మధ్య ఉన్న సంబంధమును గూర్చి ఈ వాక్యములు మనకేమి బోధించుచున్నవి.**

---------------------------------------------

---------------------------------------------

దేవుని వాక్యమును ప్రేరేపించిన పరిశుద్ధాత్మ, అదే వాక్యము ద్వారా జీవితములను మార్చుటకు పని చేసేవాడు. దేవుని వాక్యములో జీవమును అనుగ్రహించు శక్తియున్నది. పరిశుద్ధాత్మ ద్వారా అది క్రీస్తు యొక్క సజీవ వాక్యమైయున్నది.

**పేతురు 1:21 మరియు హెబ్రీ 4:12 చదువుడి. జీవితములను మార్చుటలో దేవుని వాక్యము ఎందువలన అంత శక్తివంతమైనది?**

---------------------------------------------

---------------------------------------------

"ఈ లోకాలను ఉనికిలోనికి తీసుకొని వచ్చిన సృజనాశక్తి దేవుని వాక్యములో ఉన్నది. ఈ వాక్యము శక్తిని గూర్చి విశదీకరిస్తుంది. ఈ వాక్యము జీవమును పుట్టించును. ప్రతి ఆజ్ఞ ఒక వాగ్దానమైయున్నది. ఇష్టపూర్వకముగా మనము దానిని అంగీకరించి మన ఆత్మలోనికి దానిని స్వీకరించినయెడల దాని ద్వారా అనంతమైన దేవుని జీవమును మనలోనికి అది తీసుకొని వచ్చును. అది మన స్వభావమును మార్పు చేసి దేవుని స్వరూపములోనికి మన ఆత్మను తిరిగి సృష్టించును" – ఎలెన్ జి వైట్, విద్య, పుట 126

బైబిలు తనను గూర్చి తానే వివరణ యిచ్చుకొంటుంది. లేఖనమును లేఖనముతోనే పోల్చుకోవాలి. బైబిలు విద్యార్థి దేవుని వాక్యమును గూర్చి నేర్చుకొనుటకు ఆ వాక్యమంతా ఒక మొత్తంగా పరిగణించి ఆ లేఖనములో ఉన్న ఇతర భాగములతో దానికి వున్న సంబంధమును చూడవలసియున్నది. ఆ విధముగా బైబిలును అన్వేషించుట ద్వారా లోకము యెడల దేవుని యొక్క మూల ఉద్దేశమును గూర్చి ఆ మహా సంఘర్షణ చెలరేగుటకు గల కారణము గూర్చి, విమోచన కార్యము గూర్చి మొదలైన ఈ ప్రధానాంశముల యొక్క ఇతివృత్తమును అర్థము చేసుకొనుటకు కావలసిన జ్ఞానమును సంపాదించుకొనవచ్చును" – ఎలెన్ జి వైట్, విద్య, పుట 190.

ముందుగా బైబిలు పరిశుద్ధాత్మయొక్క ఆవేశము వలన వ్రాయబడినది. అందువలన జీవితాలను మార్పు చేయగల శక్తి బైబిలుకు ఉన్నది. దానిని మనము చదివినప్పుడు అదే పరిశుద్ధాత్మ మార్పులను తీసుకొని వస్తాడు. ఇతరులతో దేవుని వాక్యాన్ని పంచుకున్నపుడు వారి జీవితాలను మార్పు చేయుటకు పరిశుద్ధాత్మ వారిలో పనిచేస్తాడు. మన మాటలను కాదు గాని తన మాటలను (దేవుని వాక్యమును) దేవుడు ఆశీర్వదిస్తాడని ఆయన వాగ్దానము చేసాడు. మానవుని మాటలలో కాదు గాని దేవుని వాక్యములో శక్తియున్నది.

గురువారం జూలై 30

## జీవితములను మార్పు చేయగల శక్తి కలిగిన పరిశుద్ధాత్మ

మానవ జీవితాలలో దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా అద్భుత కార్యములను జరిగించుచున్నాడని అపొ॥కార్య గ్రంథమును జాగ్రత్తగా పరిశీలిస్తే అర్థమవుతుంది. ఆయా సంస్కృతుల ప్రభావము క్రింద బ్రతుకుతున్న వివిధ రకాలైన జనులకు జీవిత పర్యంతము మార్పు చెందే విధముగా క్రీస్తు యొక్క కృపను మరియు సత్యమును బోధించి లోతుగా నాటుకుపోయినవారి అలవాట్ల నుండి విడుదల పొందే రీతిలో కనిపించుట ద్వారా సువార్త పరిచర్య విజయము సాధించినట్లు అపొ॥కార్య నివేదికలో బయలుపర్చబడినది. ప్రజలు ఎక్కడున్నారో అక్కడే వారిని పరిశుద్ధాత్మ కలుసుకుంటాడు. అయితే అక్కడే వారిని ఆయన విడిచి పెట్టడు. ఆయన సన్నిధిలో వారు మార్పు చెందుదురు. వారి జీవితములు నూతన ఉత్సాహముతో నూతన శక్తితో నిండియుండును.

**అపొ॥కా 16:11-25; 23-34; అపొ॥కార్య 17:33,34; 18:8 చదువుడి. బైబిలులో వ్రాయబడిన మారుమనస్సు పొందిన వారి వృత్తాంతములలో ఉదాహరణగా ఇవి కొన్ని మాత్రమే. వివిధ రకాలైన నేపథ్యములనుండి వచ్చిన ఆయా ప్రజల యొక్క జీవితాలను మార్చగలిగే దేవుని శక్తిని గూర్చి ఈ వాక్యములు మనకు ఏమి బోధించుచున్నవి?**

ఆశ్చర్యమును కలిగించే వివిధ రకాలైన ప్రజలను మనము చూస్తున్నాము. ధనికురాలైన లిడియా ఒక యూదయ వ్యాపార స్త్రీ మరియు ఫిలిప్పీయుల జైలు అధికారి ఒక మధ్యతరగతికి చెందిన రోమా ప్రభుత్వ సేవకుడు. ఈ విధముగా సమాజములో ఉన్న రకరకాలైన ప్రజల యొద్దకు పరిశుద్ధాత్మ చేరగలడు. ఎవరినైనా మార్పు చేయగల ఆయన శక్తి స్త్రీ పురుషులను, ధనికులను మరియు పేద వారిని, విద్యావంతులను మరియు విద్యావిహీనులను చేరగలదు.

ఇప్పుడు మనము పరిశీలించబోవు ఇద్దరు వ్యక్తులు చాలా ప్రాముఖ్యమైన వారే. అపొ॥కార్య 17:34లో అరేయొపగీతుడైన దియొనూసియు పొందిన మారుమనస్సును గూర్చిన వివరణను ఈ వాక్యము ఇస్తుంది. న్యాయపరమైన విషయాలను పరిశీలించే న్యాయమూర్తుల సభలోవారు సభ్యులైయున్నారు. వీరు గ్రీకు సమాజములో గౌరవ ప్రధానమైన స్థానమును సంపాదించుకున్నవారు.

పరిశుద్ధాత్మ యొక్క శక్తి ద్వారా అపొస్తలుడైన పౌలు యొక్క సువార్త పరిచర్య సమాజములో అధికారము కలిగిన ఉన్నత శ్రేణికి చెందిన మనుష్యులలో కూడా

మార్పు సంభవించెను. యూదయ సమాజ మందిరపు అధికారియైన క్రిస్పును (అపొ॥ కా 18:8) గూర్చి చూడగలము. అతడొక మత నాయకుడు. యూదులకు సంబంధించి పాత నిబంధన గ్రంథములో యూదయ తలంపులు, భావ జాలము నుండి ఆరితేరిన వాడు. అయితే పరిశుద్ధాత్మ అతనిని పట్టుకొని తన జీవితమునే మార్చివేసాడు. మనము క్రీస్తు కొరకు సాక్ష్యమిచ్చుచు దేవుని వాక్యమును ఇతరులకు పంచుకొనుటకు ఉండగా ఆయా సంస్కృతుల నుండి, నేపథ్యముల నుండి విద్య మరియు విశ్వాసముల విషయములో విరుద్దముగా ఉన్నటువంటి వారి జీవితాలలో పరిశుద్ధాత్మ గొప్ప మార్పును తీసుకొని వచ్చెను. సువార్త వర్తమానముతో మన మెవరి యొద్దకు వెళ్ళాలి. ఎవరి వద్దకు వెళ్ళకూడదనే ఊహలలో మనముండకూడదు. ప్రతి వారికి మనము సాక్ష్యము నిచ్చి వారిని మన జీవితములోనికి ఆహ్వానించుట మన విధియైయుంది. మిగిలిన కర్తవ్యమును ప్రభువు నెరవేరుస్తాడు.

**క్రీస్తు యొక్క మరణము విశ్వమంతటికి వర్తిస్తుంది. అనగా అది ప్రతిమానవునికి చెందినదైయుంటుంది. రక్షణ నిరీక్షణలోనికి కొందరు అర్హులు కాకపోవచ్చును అని మనము ఊహించుకొనకుండా ఈ ప్రాముఖ్యమైన సత్యము మనకు ఏమి బోధిస్తుంది?**

**శుక్రవారం** **జూలై 31**

## అదనపు అధ్యయనము

**ఎలెన్ జి వైట్, అపొ॥కార్య నుండి "పరిశుద్ధాత్మ వరము" పుటలు 47-56 యుగయుగాల ఆకాంక్ష నుండి "మీ హృదయమును కలవరపడనియ్యకుడి" పుటలు 667-672.**

విమోచన ప్రణాళికలో తండ్రితోను, కుమారునితోను మరియు పరిశుద్ధాత్మ సహకరిస్తాడు. ప్రజలను రక్షించే ప్రణాళికలో మనము ఆయనతో కలిసి సాక్ష్యమిచ్చే పరిచర్యలో పాల్గొంటాము. ఆయన హృదయములను ఒప్పింపచేస్తాడు. అవకాశపు ద్వారములను ఆయన తెరచియుంచుతాడు. దేవుని వాక్యము ద్వారా మనస్సులను వెలిగింపచేసి సత్యమును బయలుపర్చును. మనలను బంధీలుగా జేసి మన మీద విజయము సాధించే ప్రతికూల వాతావరణమును ఆయన తెంచివేస్తాడు. దుర్మార్గపు అలవాట్లనే సంకెళ్ల నుండి మనలను విడుదల చేస్తాడు.

మనము యేసు కొరకు సాక్ష్యమిచ్చుచుండగా మనము పరిశుద్ధాత్మతో సహకరిస్తున్నామనే విషయాన్ని మనము జ్ఞాపకముంచుకోవడం చాలా ముఖ్యము.

మనకన్నా ముందుగానే ఆయన ఉనికిలో ఉన్నాడు. ఆయన సువార్త వర్తమానము స్వీకరింపజేయుటకు మనకన్నా ఆయనే అక్కడ ఉండి హృదయములను సిద్దము చేస్తాడు. మనము ఎవరి యెడలనైనా దయ కలిగి ప్రవర్తించినచో ఆయన మనతో ఉండి ఏవిధముగా చేయాలో మనసులను సిద్దము చేస్తాడు. మన సాక్ష్యమును ఇతరులతో పంచుకొనేటప్పుడు బైబిలు తరగతులను నిర్వహించేటప్పుడు సత్యముతో నిండిన సువార్త వర్తమాన కరపత్రములను పంచి పెట్టేటప్పుడు లేక సంఘమునకు వెలుపల వేరే ప్రాంతములో సువార్త ప్రచార సభలను నిర్వహించేటప్పుడు ఆయన మనతో ఉంటాడు. మన కార్యములను ముగించుకొని వెళ్ళిపోయినను ఆయన మాత్రము అక్కడ సమావేశమైన వారితో ఆయన నిరంతరము కృషి చేస్తూనే ఉంటూ వారి హృదయములను సత్యమువైపు మళ్ళించి చివరికి రక్షణ జ్ఞానమునకు ఆ వ్యక్తిని ఆయనే నడిపిస్తాడు.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మీ సబ్బాతు బడి సభ్యుల గుంపుతో మీ అనుభవములను అనగా పరిశుద్దాత్మ ఎంత శక్తివంతముగా మీతో కలిసి పని చేసెనో పంచుకోండి.

2. విశ్వాసమును ఇతరులతో పంచుకొనుటకు ఎప్పుడైన సందేహించి యున్నావా? లేక భయపడి యున్నావా? పరిశుద్ధాత్మ చేయు సువార్త పరిచర్య జ్ఞానము మీరు సాక్ష్యమిచ్చేటప్పుడు ఏవిధముగా మనకు సహాయపడుతుంది?

3. ఈ వారము పాఠములో మనమిచ్చే సాక్ష్యములో పరిశుద్ధాత్ముని యొక్క "క్రియాశీల పాత్ర"ను గురించి చర్చించి యున్నాము. మనము సాక్ష్యమిచ్చే పనిలో నిమగ్నమైయుండగ పరిశుద్ధాత్మ ఏయే విధాలుగా మనకు మన పనిలో సహాయపడగలడు. మనము సాక్ష్యమిచ్చుచుండగా ఇతరుల కొరకు పరిచర్యను చేయుటకు మనలను ఏవిధముగా అవసరమైన పనిముట్లతో సిద్ధము చేయును?

4. సాక్ష్యమిచ్చుటకు బైబిలే మూలాధారమని ఈ పాఠము ద్వారా చదువుకున్నాము. మన విశ్వాసమునకు మరియు మనము ఇచ్చే సాక్ష్యమునకు బైబిలు ఎందుకంత ప్రాముఖ్యమైన భాగమైయున్నది?

❖❖❖